

అమ్మకానికి ఉంచిన ఎద్దుల బండ్లు, వ్యవసాయ సామగ్రీ



కాడిమాన్ల అమ్మకం



విక్రయానికి ఉంచిన తాళ్లు, జతికలు, మెడ గంటలు



జాతరలో అమ్మకానికి ఉంచిన ఎద్దులు

కొనుగోళ్ల జాతర

కోడుమూరు మండలం గోరంట్ల లక్ష్మీమాధవస్వామి జాతరలో కొనుగోళ్ల సందడి నెలకొంది. గోరంట్ల జాతర అంటే రైతులకు సంబరమే. వ్యవసాయ పనిముట్లు, ఎద్దుల క్రయవిక్రయాలకు పెట్టింది పేరు. జాతరలో మొత్తం కిలోమీటర్ పొడవున రెండు వేల రకాల వ్యవసాయ పనిముట్లు, కాడెద్దులు, మిఠాయి అంగళ్లు, గాజులు, ఆటవస్తువుల దుకాణాలతో పాటు, మాంసపు దుకాణాలు, ముఖ్యంగా మాంసం ప్రియులకు నోరూరించే కడ్డీల మాంసం అంగళ్లను ఏర్పాటు చేశారు. అలాగే చిన్నారులకు ఆట విడుపు కోసం రంగుల రాట్నం, ఎగిరే నెట్ వంటివి ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలిరావడంతో జాతర కిటకిటలాడుతోంది. 20 రోజుల పాటు జరిగే గోరంట్ల జాతరను ప్రతి రోజు వేలాది మంది సందర్శించి ఆనందోత్సవాల్లో మునిగి తేలుతుంటారు. కోడుమూరు రూరల్:



నిప్పులపై మాంసం కడ్డీలను కాలుస్తున్న దృశ్యం



ముల్లు కట్టెలు, చేతి కర్రల విక్రయం



జాతరలో ఏర్పాటుచేసిన రంగుల రాట్నం



గాజులు వేయించుకుంటున్న మహిళలు



చిన్నారుల ఆటవస్తువులను కొంటున్న మహిళలు



మిఠాయిలను కొంటున్న ప్రజలు

క్లుప్తంగా

ఇంగ్లిష్ పరీక్షకు తొమ్మిది మంది గైర్హాజరు

సి.బెళగల్: మండలంలో పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. పబ్లిక్ పరీక్షల నిర్వహణలో భాగంగా మూడవ పరీక్ష శుక్రవారం నిర్వహించగా కొత్తకోట జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో ముగ్గురు, ఏపీ మోడల్ స్కూల్ కేంద్రంలో ఇద్దరు, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్‌లో ఒకరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ముగ్గురు చొప్పున మొత్తం 9 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వహణ అధికారులు వంశీమోహన్, బలరాముడు, రఘురామిరెడ్డి, మల్లయ్య తెలిపారు. సి.బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి పరీక్ష కేంద్రాల వద్ద మహిళా కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు. అలాగే ఆయా పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది విద్యార్థులకు సేవలందించేందుకు క్యాంప్‌లను ఏర్పాటు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

గడివేముల: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ రుబీనా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి 40 సీట్లు, ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 40 సీట్లు, ఇంటర్ సెకండ్ ఇయర్‌లో ఖాళీగా ఉన్న 16 సీట్లలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థినులు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు, తల్లిదండ్రులు లేకపోతే మరణ ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువపత్రం, రేషన్‌కార్డు అప్‌లోడ్ చేయాలన్నారు.

చిన్నారుల వికాసానికి కృషి చేయాలి

సి.బెళగల్: గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లు వారి కేంద్రాలకు వచ్చే చిన్నారుల వికాసానికి కృషి చేయాలని సి.బెళగల్ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ బీ, పడాయి బీ కార్యక్రమ అమలులో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఇస్తున్న శిక్షణ కార్యక్రమం రెండవ రోజు కొనసాగింది. శుక్రవారం శిక్షణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల పోషణ, వికాసానికి దోహదపడేలా టీచర్లు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారుల వికాసం, సంరక్షణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభం కాగా శనివారం ముగుస్తుందని ఆమె తెలిపారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కల్లూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు యేసు, హుస్సేన్, సుబ్బారెడ్డి, రాముడు, వెంకటేష్ డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా వారు శుక్రవారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్, గట్టయ్య నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న శిక్షణ

పాణ్యం: కేంద్రప్రభుత్వ పథకం పోషన్‌బీ .. పడాయ్‌బీపై మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం రెండో రోజు శిక్షణ కొనసాగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ పాల్గొని పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు ఎలాంటి పౌష్టికాహారం ఇవ్వాలో శిక్షణ ఇచ్చారు.

ఏఈఓఎస్‌యూ డైరీ విడుదల

కర్నూలు (అగ్రికల్చర్): రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం (ఏఈఓఎస్‌యూ) – 2025 డైరీని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత విడుదల చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డితో కలసి డైరీని ఆవిష్కరించారు. ఆ సంఘం అధ్యక్షుడు రవి ప్రకాష్ రావు, కార్యదర్శి ఎం.పి.కాశన్న తదితరులు పాల్గొన్నారు.

వినూత్న నిరసన



భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

ఓర్వకల్లు: పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఓర్వకల్లు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉపాధి కూలీలతో కలిసి ఆయన భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన తెలిపారు. 10 వారాలు పని చేసినా రూపాయి కూడా ఇవ్వకుండా... అదే పథకం కింద ఫాంపాండ్ల నిర్మాణాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భూమిపూజ చేసేందుకు వస్తుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉగాది, రంజాన్, ఈస్టర్ పండుగల సమయంలో కూలీలకు వేతనాలు చెల్లించక పోవడం అన్యాయమన్నారు. ఉపాధి కూలీల వేతనాలు ఇచ్చిన తర్వాతే ఫాంపాండ్ నిర్మాణానికి భూమిపూజ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల నాయకులు రామకృష్ణ, శివకుమార్, ఉపాధి కూలీలు దానమయ్య, సువర్ణమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించండి

కోడుమూరు రూరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి కాలినడకన తరలివెళుతున్న కర్ణాటక భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడలాఫీసర్ డాక్టర్ రఘు వైద్య సిబ్బందిని ఆదేశించారు. కోడుమూరులోని పర్రప్పజిన్నులో శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తులకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేసి, పాదయాత్రికులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీయడంతో పాటు, మందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తుల సౌకర్యార్థం జిల్లాలో కోడుమూరు, సి.బెళగల్, పోలకల్, రేమట, గూడూరు, పెంచికలపాడు, పెద్దపాడు, కల్లూరు, గార్గేయపురం, గోకులపాడు వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే భక్తులు పాదయాత్ర సమయంలో శుభ్రమైన మంచినీరు, ఆహారం తీసుకోవాలని, ఎండలో నడిచేటప్పుడు తలపై టోపీ లేదా టవల్ వేసుకోవాలని సూచించారు. దాత ఎస్‌జీ శంకర్ బాబు, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పాదయాత్రికులకు మందులను అందజేస్తున్న నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కోడుమూరు రూరల్: పరిసరాల శుభ్రతతో రోగాలకు దూరంగా ఉండవచ్చని జిల్లా మలేరియా అధికారి నూకరాజు ప్రజలకు సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని అనుగొండ గ్రామంలో డెంగీ కేసు నమోదైన ప్రాంతంలో జిల్లా మలేరియా అధికారి నూకరాజు వైద్య సిబ్బందితో కలిసి పర్యటించి పరిసరాల శుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ.. ప్రజలంతా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, పరిసరాల్లో దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రివేళ దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. అలాగే వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయాలని ఆదేశించారు. సీహెచ్‌ఓ శాంత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్, సూపర్‌వైజర్ శారద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అనుగొండలో ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

సి.బెళగల్: రైతులు ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు, లాభాలను పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో 2025– 2026 సంవత్సరానికి సెర్ప్, వ్యవసాయ శాఖల సమన్వయంతో చేపట్టనున్న ప్రకృతి వ్యవసాయ ప్రణాళికలపై మండల ఇన్‌చార్జ్ రవిసాగర్ వ్యవసాయ సిబ్బంది, వెలుగు సిబ్బందికి, రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ, రవిసాగర్‌లు ప్రకృతి వ్యవసాయ విధానాలు, లాభాలను వివరించి, రైతులు ప్రకృతి వ్యవసాయానికి ముందుకు వచ్చేలా వ్యవసాయ సిబ్బంది చూడాలన్నారు. వెలుగు సీసీలు శ్రీనివాసులు, మాదులు, మహబూబ్‌బాష, రాముడు, వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలు ఉన్నారు.



ప్రకృతి వ్యవసాయ ప్రణాళికలపై మాట్లాడుతున్న అధికారి రవిసాగర్

విద్యుత్ వైర్లు తగిలి కార్మికుడికి తీవ్రగాయాలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు గ్రామం ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో గృహ నిర్మాణ కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన నరసింహ ఇంటికి సెంట్రింగ్ పనుల నిమిత్తం అలంపూర్ మండలం కె.సింగవరం గ్రామానికి చెందిన రఫీ అనే యువకుడు కూలీగా ఉన్నాడు. నిర్మాణ పనుల్లో భాగంగా బైడింగ్ వైర్లను కడ్డీలకు చుడుతుండగా మిద్దెకు సమీపంలో ఉన్న 11 కేవీ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మిద్దెపై నుండి కిందకు పడిపోయడు. ప్రమాదంలో అతని చెయ్యి, వీపు భాగం కాలిపోయింది. బాధితుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు.

ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు

ఇందిరమ్మ కాలనీలో ఎన్నో ఏళ్లుగా 11 కేవీ వైర్లు మిద్దెలకు అతి సమీపంలో వేలాడుతున్నాయి. దీనిపై పలు మార్లు విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ బాలపీర ధ్వజమెత్తారు. గతంలోనూ విద్యుత్ ప్రమాదాలు జరిగాయని వివరించారు. సమస్యను మండల సర్వసభ్య సమావేశంలో ఎన్నోమార్లు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా నా సమస్యను పరిష్కరించకుంటే కాలనీ ప్రజలతో కలిసి కర్నూలు మండల విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని స్పష్టం చేశారు.



తీవ్రంగా గాయపడిన రఫీ

ఇళ్ల స్థలాల కోసం ధర్నా

కర్నూలు(రూరల్): ఇచ్చిన హామీ ప్రకారం సీఎం చంద్రబాబు పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు అధ్యక్షతన జిల్లా నాయకులు జగన్నాథం, పి.రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మామిదాలపాడు, మాసమసీదు 38వ వార్డు ప్రజలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని 98వ సచివాలయం ముందు ధర్నా నిర్వహించి వార్డు అడ్మిన్‌లకు వినతి పత్రం అందజేశారు. ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు సాయం అందించాలని, ఇసుక, సిమెంటు,స్టీలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు సుశీలమ్మ,అంకమ్మ, దానమ్మ, బేగం, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పోక్సో చట్టంపై అవగాహన

కర్నూలు(రూరల్): పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలని కర్నూలు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి టి.జ్యోష్ణదేవి విద్యార్థులకు సూచించారు. దిన్నెదేవరపాడు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించడం' అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అపరిచిత వ్యక్తులను నమ్మరాదని, స్మార్ట్ ఫోన్లను, టీవీలను విజ్ఞానం కోసం వాడుకోవాలని సూచించారు. ఎవరైనా లైంగిక వేధింపులకు గురిచేస్తే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు తెలపాలన్నారు. పోక్సో చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని వివరించారు. పోక్సో కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టు ఉందని తెలిపారు. తాలుకా అర్బన్ ఎస్ఐ నరేష్, ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ యాసిన్, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బిహార్ యువకుడి మృతదేహం లభ్యం

పాణ్యం: రైల్వే డబ్లింగ్ పనుల కోసం వచ్చి ప్రమాదవశాత్తూ వాగులో పడి కొట్టుకుపోయని బిహార్ యువకుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు.. బిహార్ రాష్ట్రం సమస్త్యపూర్ జిల్లాకు చెందిన విశ్వజిత్ మాన్‌జీ (32), రాహుల్‌తో కలిసి రైల్వే డబ్లింగ్ పనుల నిమిత్తం పాణ్యంకు వలస వచ్చారు. ఈనెల 19న సాయంత్రం బైక్‌పై కంపెనీ వద్దకు బయలుదేరారు. మార్గమధ్యంలో పాణ్యం – కొణిదేడు గ్రామాల మధ్య ఒద్దెల వాగులో ప్రమాదశాత్తూ పడిపోయారు. రాహుల్‌కు గాయాలతో బయటపడగా, విశ్వజిత్ మాన్‌జీ నీటిలో కొట్టుకుపోయాడు. పోలీసులు, స్థానికులు గాలించినా ఆచూకీ లభించ లేదు. ఈక్రమంలో శుక్రవారం వాగు నుంచి కిలోమీటర్ దూరంలో కల్వర్టు వద్ద నీటితో మృతదేహం తేలియాడుతూ ఉండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య ప్రయాదేవి, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడు అరవింద్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బిల్లులు చెల్లించాలి

కల్లూరు: ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని సీపీఎం మండల నాయకులు కృష్ణ, మధు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ నాగేషకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది వారాల వేతనం అందకపోవడంతో కూలీల జీవనం దుర్భరంగా మారిందని, ఈస్టర్, రంజాన్, ఉగాది పండగలు వస్తుండటంతో ఇప్పటికైనా వారికి వేతనాలిచ్చి ఆదుకోవాలని కోరారు. అలాగే ఎండలు ప్రారంభమైనందున పని ప్రదేశంలో టెంట్లు, మజ్జిగ, తాగునీరు సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఉపాధి కూలీల ఆకలి కేకలు పట్టవా?

కోడుమూరు రూరల్: పది వారాలుగా కూలి డబ్బులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం, ఉపాధి కూలీల ఆకలి కేకలు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు పట్టవా అని చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గురుశేఖర్ ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ శుక్రవారం కోడుమూరులోని పాతబస్టాండ్ సెంటర్‌లో ఉపాధి కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండుటెండలో రోడ్డుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గురుశేఖర్ మాట్లాడుతూ.. కరువుతో పనుల్లేక ఉపాధి పనుల్లోకి వెళ్లిన కూలీలకు పది వారాల నుంచి డబ్బులు చెల్లించకుండా ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తోందన్నారు. పనులు చేస్తేగాని పూటగడవని కూలీలకు నెలల తరబడి కూలి డబ్బులివ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. డబ్బులందక కూలీలు ఇబ్బందులు పడుతున్న సమయంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉపాధి పథకం కింద ఫారం ఫండ్ పనులకు భూమి పూజ పేరుతో జిల్లాకు వస్తుండడం దారుణమన్నారు. ఆయనైనా స్పందించి ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులను ఇప్పించేందుకు కృషి చేయాలని, లేకపోతే కూలీలతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గఫూర్‌మియ్యా, రాజు, వీరన్న, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



కోడుమూరులో కూలి డబ్బులు చెల్లించాలంటూ నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

రథోత్సవాన్ని జయప్రదం చేయండి

కోడుమూరు రూరల్: ఉగాది పండుగ పురస్కరించుకుని కోడుమూరులో హంద్రీ నది ఒడ్డున వెలసిన వల్లెలాంబదేవి ఆలయంలో నిర్వహించే రథోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం సాయంత్రం రథోత్సవ ఆహ్వాన కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులు, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయించారు. వారు మాట్లాడుతూ.. ఉగాది సందర్భంగా ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 29న గోపూజ, గణపతి పూజ, గంగ పూజ, సాయంత్రం ప్రభోత్సవం, 30వతేదీ ఉగాది రోజున అమ్మవారి రథోత్సవం, 31న పారువేట, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని, ప్రజలంతా ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు పూల వాసు, సాలప్ప, హనుమంతు, గిడ్డయ్య తదితరులున్నారు.



వల్లెలాంబ రథోత్సవ ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కాళ్లకు కర్రలు కట్టుకొని శ్రీశైలం వెళ్తున్న కన్నడ భక్తులు

నడిపించే భక్తి

కర్నూలు(రూరల్): తమ ఇలవేల్పుగా కొలిచే శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబిక అమ్మవార్లపై కన్నడిగులకున్న భక్తి చెప్పలేనిది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కన్నడిగులు అమ్మవారికి సారెను సమర్పించేందుకు ఏటా కాలినడకన శ్రీశైలం వెళ్లడం ఆనవాయితీ. అందులో భాగంగా కర్ణాటక రాష్ట్రం బాగళ్ కోట్ జిల్లా, బిళికేహూర్ గ్రామానికి చెందిన శివ బిళకేర్, సిద్దు బేవుర్ అనే ఇద్దరు భక్తులు మూడు అడుగుల పొడవు, ఏడు ఇంచుల చుట్టుకొలతతో ఉన్న చెక్క కాళ్లపై 450 కిలోమీటర్ల మేర నడిచి శుక్రవారం గార్గేయపురం వద్దకు చేరుకున్నారు. శ్రీశైల మల్లన్నపై భక్తితో మొక్కుబడిగా చెక్క కాళ్లపై నడిచి వెళ్తున్నట్లు వారు తెలిపారు.

డిప్యూటీ సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

• కలెక్టర్ రంజిత్‌బాషా

పాణ్యం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటనను జయప్రదం చేయాలని కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో నిర్వహించే సభ ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉదయం ఎయిర్‌పోర్ట్ నుంచి రోడ్డు మార్గాన పూడిచెర్ల వద్దకు చేరుకొని అక్కడ ఫాంపాండ్‌కు భూమి పూజ చేస్తారన్నారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నవ్య పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా భద్రతపై కలెక్టర్ రంజిత్ బాషా పోలీసుల అధికారులతో మాట్లాడారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

'పది' పరీక్షలకు నలుగురు గైర్హాజరు

ఓర్వకల్లు: మండల పరిధిలోని వేర్వేరు పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షకు నలుగురు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఓంకార్ యాదవ్ తెలిపారు. మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాలలో 899 మంది హాజరు కావాల్సి ఉండగా 895 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.